

# సా 'మాన్యుడు'

గాఢనిద్రలో వున్న చందూకి ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది. నిద్రకళ్లకు బెడ్ లైట్ మసక వెలుతురులో 'చీకటి' తప్ప మరేం కన్పించలేదు. ఓ క్షణం తనకెందుకు మెలకువ వచ్చిందీ అర్థంకాలేదు. కళ్లు నులుముకుంటూ పక్కనే భార్యకేసి చూశాడు. పొట్ట చేత్తో పట్టుకుని పక్కమీద మెలికలు తిరిగిపోతూ కనిపించింది. పళ్ల బిగువున, అతికష్టమ్మీద బాధని అణచుకునే ప్రయత్నం చేస్తోంది.

'ఏమైవుంటుంది' అని అయోమయపడి చూస్తున్నంతలో "హాస్పిటల్‌కి తీసుకువెళ్లండి" అతికష్టంమీద మాటలు కూడదీసుకుంటూ అంది. చందూకి నిద్ర మత్తు వదిలిపోయింది. ఒక్క వుదుటున మంచమ్మీంచి కిందికి దూకి తలుపు తెరుచుకుని కంగారుగా రోడ్డు మీదికొచ్చాడు.

రాత్రివేళ కావడంతో రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. కనుచూపు మేరలో ఎక్కడా ఆటోగాని, రిక్షాగానీ కనిపించలేదు. 'ఇప్పుడేమిటి చెయ్యటం'? అతడిలోని కంగారు కాస్తా ఆందోళనగా మారింది. ఏమి చెయ్యాలో పాలుపోక అలాగే నిలబడి చూస్తున్నంతలో దూరంగా ఏదో వాహనం వీధి మలుపు తిరుగుతూ కనిపించింది. 'ఆటో అయితే బావుండును' అనుకుంటూ కళ్లు చికిలించి చూశాడు. వాహనం దగ్గరవుతున్న కొద్దీ దాన్ని ఆటోగా పోల్చుకుని 'థాంక్ గాడ్' అనుకున్నాడు.

చేయెత్తి నిల్చోవటంతో దగ్గరగా వచ్చి ఆగింది ఆటో.

ఆటోవాడు ఆటోలోంచి తల బయటకు పెట్టి 'సారీ సర్! వేరే ఆటో ఏదైనా ట్రై చేయండి. నేను ఇంటికి వెళ్లిపోతున్నాను' అన్నాడు.

వాడి మాటలతో చందూ గుండెల్లో రాయి పడింది. "చూడు.... అత్యవసరంగా హాస్పిటల్‌కి వెళ్లాలి. ప్లీజ్..." అన్నాడు బ్రతిమలాడుతూ.

ఆటోవాడు ఓ క్షణం సాలోచనగా వుండి, చందూకేసి చూసి, తలూపుతూ "రండి" అన్నాడు.

చందూ ఒక్క వురుకున ఇంట్లోకి పరిగెత్తి, భార్యను రెండు చేతులా ఎత్తుకొచ్చి ఆటోలో పడుకోబెట్టి... తనూ ఎక్కి కూర్చుని "జనరల్ హాస్పిటల్‌కి పోనివ్వు" అన్నాడు.

భార్య మూలుగుతూనే వుంది. క్షణక్షణానికీ ఆమె బాధ తీవ్రతరమవుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. "ఎంత... పది నిమిషాల్లో హాస్పిటల్లో వుంటాం కొంచెం ఓర్చుకో" అననైతే అన్నాడు కానీ చందూకి కూడా కంగారుగానే వుంది. ఏ క్షణంలో డెలివరీ అవుతుందోనని.

ఆటో కదిలింది. పాసింజర్ అవసరాన్ని గుర్తించినవాడిలా... వేగంగా పోనిస్తున్నాడు. వీలైనంత తొందరగా హాస్పిటల్ చేర్చాలన్న తాపత్రయం ఆటోవాడి డ్రైవింగ్‌లో స్పష్టంగా తెలుస్తోంది. చందూ మనసు ఆటోవాడి పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ఆందోళన కొంచం నెమ్మదించింది. సీట్లో సర్దుకుని వెనక్కి జేరగిలబడబోతూ, యధాలాపంగా మీటర్ కేసి చూసిన చందూ ఒక్కసారిగా వులిక్కిపడ్డాడు.

మీటర్ ఆఫ్‌లో వుంది. 'అసలే రాత్రి... దానికి తోడు హాస్పిటల్ అవసరం... ఆటోవాడు దోపిడీకి దిగడానికి ఈ ఒక్క కారణం చాలు' అనుకుంటూ "చూడు... మనం కిరాయి మాట్లాడుకోలేదు. ఇంతకూ ఏమివ్వమంటావ్"? అడిగాడు చందూ.

ఆటోవాడి నుంచి బదులు లేదు. ఓ క్షణం ఆగి మళ్లీ అడిగాడు. ఊహూ... బదులే లేదు. 'తను అడిగింది వాడికి వినిపించలేదా? రాత్రి పూట... నిశ్శబ్ద వాతావరణంలో... తనకి అడుగు దూరంలో వున్నవాడికి వినిపించక పోవడమా? ఊహు... కానే కాదు. దిగిన తర్వాత వీలైనంత ఎక్కువ గుంజుకోవాలనేదే



వీడి ఎత్తుగడ! అసలే ముందే ముందరి కాళ్లకు బంధం వేసేశాడు 'ఇంటికి వెళ్లిపోతున్నాను. వేరే ఆటో చూసుకోండని'. ఆటో దొరికితే చాలు అన్న ఆలోచనని తెలివిగా అప్పుడే తన మెదడులో విత్తేసాడు. అడిగినంతా ఇవ్వడానికి ముందస్తు ప్రిపరేషన్ అన్నమాట అది! ఎవరికి తెలియదీ ఆటోవాళ్ల సంగతి? రాస్కెల్' కసిగా పళ్లు నూరుకున్నాడు చందు. ఇంతకుముందు ఆటోవాడిపట్ల కలిగిన కృతజ్ఞతాభావం స్థానే, ఎదుటి వారి అత్యవసర పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోజూసే వాడి అవకాశవాదతనం మీద అసహ్యం కలిగింది.

'వీడు ఇప్పుడు ఎంత అడుగుతాడో... ఏమో? ఇప్పుడెలా? వీడు అడిగినంతా ఇచ్చి తీరాల్సిందేనా? ఆలోచనలో పడ్డాడు. ఇంటి నుంచి హాస్పిటల్‌కి ఎన్ని కిలోమీటర్లుంటుందో సుమారుగా తెలుసు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మినిమం చార్జ్... పన్నెండు రూపాయలు, ఆ పైన కిలోమీటరుకు మూడ్రూపాయలు... ఆ చొప్పున ఎంత ఇవ్వవచ్చో మనసులోనే లెక్క వేశాడు. 'రాత్రిపూట కనుక ఓ ఐదు రూపాయలు అటు... ఇటు, అంతే. అంతకుమించి అడిగితే మాత్రం ఇచ్చేది లేదు. డబ్బు సమస్య కాదిక్కడ. తన ఉదారం కొద్దీ ఎంతైనా ఇవ్వగలడు. కానీ... వెధవ ట్రిక్కులు ప్లే చేసి తన అవసరాన్ని కేష్ చేస్కోవాలని చూస్తే మాత్రం తను సహించడు, సహించబోడు. అసలు ఆ మాటకొస్తే – మీటరు వేయకుండా ఆటో నడపడం నిబంధనలకు విరుద్ధం. కిరాయి విషయంగా గొడవ పెడితే తనేమీ చూస్తూ ఊరుకోడు. అవసరమైతే ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌కి కంప్లైంట్ ఇచ్చి మరీ తిక్క కుదురుస్తాడు.' ఆటోవాడినెలా ఎదుర్కోవాలో మనసులోనే వ్యూహరచన చేసుకున్నాడు.

ఆలోచనల్లోనే ఆటో హాస్పిటల్ చేరింది.

"ఆ... ఏమివ్వమంటావ్" ఒకింత సీరియస్‌గాను, నిర్లక్ష్యంగానూ అడిగాడు.

"అమ్మగారికి సుఖప్రసవం కావాలని కోరుకుంటున్నాను. వెళ్లిరండి సార్" అన్నాడు ఆటోవాడు తల బయటపెట్టి.

"తన శ్రేయస్సు కోరుతున్నవాడిలా ఆ నటన చూడు... ఎంత టాక్టికల్‌గా డీల్ చేస్తున్నాడో... వీడి ఈ అభిమానానికి తను పొంగిపోయి ఇప్పుడు వాడడిగినంతా ఇచ్చేయాలి. రాస్కెల్! ఎవడికి తెలీదీ ఆటోవాళ్ల పల్స్. నేనేనా అంత తెలివి తక్కువవాడిని. కసిగా పళ్లు నూరుకుంటూ "ముందు కిరాయి సంగతి తేల్చు" అన్నాడు కావలసిన దానికిన్నా ఎక్కువ విసుగుని ప్రదర్శిస్తూ. అలా నిర్లక్ష్యంగా వుంటే ఆటోవాడు ఎక్కువ అడగడానికి సంకోచిస్తాడని.

"వద్దు సార్, వెళ్లి రండి" అన్నాడు ఆటోవాడు చిర్నవ్వుతో.

'వద్దా?' చందూ ఆశ్చర్యపడుతూ, 'కిరాయి వద్దంటావేమిటి?' అనబోయేంతలోనే ఆటోవాడు గేరు మార్చి ఆటోని ముందుకురికించాడు.

చందూ ఖంగుతినిపోయాడు.

'కిరాయి విషయంలో వీడు వెయ్యబోయే వెధవ్వేషాలు ఎలా తిప్పికొట్టాలా అని తను ఇంతసేపూ ఆలోచించి పకడ్బందీగా ప్రిపేరైపోతే వీడేమిటి అసలు కిరాయే వద్దని పోతున్నాడు?' అనుకుంటూ అయోమయంలో పడి వెళ్తున్న ఆటోకేసే చూస్తూ నిలబడిపోయిన చందూ కళ్లకు... ఆటో వెనుక నల్లటి రెక్సిన్ టాప్ మీద 'గర్భిణులకు, వృద్ధులకు ప్రయాణం ఉచితం' అన్న తెల్లటి అక్షరాలు మసక వెలుతురులో సైతం స్పష్టంగా కనిపించాయి. ●